

ఆటోను ఢీకొన్న లారీ

ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో సెప్టిక్ట్యాంక్ కార్మికుడు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. - 8లో



తొలి సినిమా హార్సిలీహిల్స్‌పైనే

తాను నటించిన తొలి సినిమా కాళరాత్రి హార్సిలీహిల్స్‌పైనే చిత్రీకరణ జరిగిందని సీనియర్ నటి రమాప్రభ తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.500	రూ.600
రెండోరకం	రూ.360	రూ.480

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 269 మెట్రిక్ టన్నులు



ప్రగతి పథంలో అన్నమయ్య



జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారుల చర్యలు
- అన్నమయ్య జిల్లా ఏర్పడిన అనంతరం రెండోదఫా వేడుకలు
- గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా అందరికీ సంక్షేమ ఫలాలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సాక్షి రాయచోటి : అన్నమయ్య జిల్లా ప్రగతిపథం వైపు పరుగులు తీస్తోందని..కొత్తగా ఏర్పడిన తర్వాత రెండోసారి స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహించుకోవడం సంతోషకరమైన పరిణామమని, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 77 సంవత్సరాలైన సందర్భంగా మంగళవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని పోలీసు పరేడ్ మైదానంలో జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా, ఎస్పీ గంగాధర్‌రావులతో కలిసి ముందుగా ఇన్‌ఛార్జి మంత్రి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించి పోలీసు పెరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. భారతదేశాన్ని ఆంగ్లేయుల బారి నుంచి విముక్తి కల్పించేందుకు ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు.

రైతన్నకు తోడుగా జగనన్న ప్రభుత్వం

ఈ ఏడాది ఆలస్యంగా నైరుతి రుతు పవనాలు ప్రవేశించడంతో ఆశించిన మేర వర్షపాతం నమోదు కాలేదన్నారు. జిల్లాలోని 400 ఆర్బీకేల ద్వారా రైతన్నలకు నాణ్యమైన విత్తనాలను ఇప్పటికే పంపిణీ చేసినట్లు, ఒకవేళ వర్షాభావం ఇలాగే కొనసాగితే కంటిజెన్సీ పంటల ప్రణాళిక మేరకు రైతన్నలకు ఉలవ, కంది, రాగి, సజ్జ విత్తనాలను రాయితీతో సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా పెట్టుబడి సాయం కింద యేటా రూ. 13,500 చొప్పున ఐదేళ్లలో రూ. 67,500 లబ్ధిని రైతులు పొందుతున్నారన్నారు. 2023–24 సంవత్సరంలో డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద 2.02 లక్షల రైతు కుటుంబాలకు రూ. 152 కోట్లను అందజేసినట్లు చెప్పారు. అలాగే వ్యవసాయం కోసం రైతులకు పగటిపూట 9 గంటల నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఉద్యాన రైతులకు చేయూతనివ్వడానికి రూ. 8.50 కోట్ల మేర ఆర్థిక కార్యచరణ ప్రణాళికతో ముందుకు వెళుతున్నామన్నారు. బి.కొత్తకోట, ములకలచెరువు, రామసముద్రం మండలాలలో ఒక్కొక్కటి రూ. 5.50 కోట్ల ఖర్చుతో మూడు టమాటా ప్రాథమిక ఆహారశుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేశామన్నారు. పాడి పరిశ్రమ ద్వారా ప్రస్తుతం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటుపరంగా సరాసరిన 6–8 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోందన్నారు. రాబోయే రెండు సంవత్సరాలలో 10 లక్షల లీటర్ల మేర పాల ఉత్పత్తి పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 13 డాక్టర్ వైఎస్సార్ సంచార పశు వైద్య వాహనాల ద్వారా జిల్లాలో ఉన్న 21 లక్షల గొర్రెలు, మేకలకు రైతుల ఇంటి వద్దనే పశు వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు.

జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా 2022–23 విద్యా సంవత్సరానికి జిల్లాలో అర్హత గల 1.52 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలలోరూ. 229 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. జగనన్న విద్యా కానుక పథకం ద్వారా ప్రస్తుత విద్యా సంవత్సరానికి 2219 పాఠశాలల్లోని లక్షా 54 వేల మంది విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, ఇతర సామాగ్రి కిట్ రూపంలో అందించామన్నారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజల ఇంటి వద్దనే 14 రకాల డయాగ్నోస్టిక్స్ సేవలతోపాటు దీర్ఘకాలిక వైద్య సేవలు అందిస్తున్నామని, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా రెండున్నర వేల జనాభాకు ఒకటి చొప్పున విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశామన్నారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా సరికొత్త విప్లవం

ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజల ముంగిటకే తీసుకెళ్లి ప్రజల జీవన ప్రమాణాల స్థాయిని మెరుగు పరిచేందుకు సచివాలయ వ్యవస్థ అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో 7536 మంది గ్రామ, 1112 మంది వార్డు వలంటీర్ల ద్వారా అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా 3147 సమస్యలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించామన్నారు. జగనన్న సురక్ష పథకం కింద అన్ని రకాల సర్టిఫికెట్లను ప్రజలకు ఉచితంగా మంజూరు చేశామన్నారు

వైఎస్సార్ భరోసా పథకం కింద జులై మాసంలో 2,13,076 మంది పింఛన్‌దారులకు దాదాపు రూ. 59.90 కోట్లను పంపిణీ చేశామన్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా కింద ఈ ఏడాది 333 జంటలకు రూ. 2.96 కోట్ల ఆర్థికసాయం అందించామన్నారు. వైఎస్సార్ చేయూత పథకం కింద 45–60 ఏళ్ల మధ్య వయస్సుగల ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అక్కాచెల్లెమ్మలకు ఏటా రూ. 18,750 చొప్పున మూడు విడతల్లో 89 వేల మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 455 కోట్లను మహిళల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. మహాత్మా జ్యోతిరావుపూలే అడుగుజాడలే ఆదర్శంగా రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి శాశ్వత ప్రాతిపదికన బీసీ కమీషన్ ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ముస్లిం మైనార్టీల సబ్ ప్లాన్ పారదర్శకంగా అమలు చేయడం జరుగుతోందన్నారు.

సాగు, తాగునీటి రంగాలకు అధిక ప్రాధాన్యత

దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ కలలుగన్న జలయజ్ఞాన్ని కొనసాగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. ఇందులో భాగంగా జీఎన్ఎస్ఎస్ నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ స్కీమ్ పనులకు రూ. 5036 కోట్లు, రామాపురం లిఫ్ట్ స్కీమ్ పనులకు రూ. 227.10 కోట్లు, వెలిగల్లు ప్రాజెక్టు లిఫ్ట్ స్కీమ్ పనులకు రూ. 94.56 కోట్లు, ఝరికోన లిఫ్ట్ స్కీమ్ పనులకు రూ. 42.25 కోట్లు మంజూరు చేశామన్నారు. అలాగే జలజీవన్ మిషన్ పథకం కింద శాశ్వతంగా నీటి సరఫరా కోసం గ్రామీణ ప్రాంతంలోని 508 జగనన్న హౌసింగ్ లే అవుట్లలో రూ. 93.68 కోట్లతో పనులు చేపట్టామన్నారు. జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 295 కోట్ల పెట్టుబడితో 21 వేల మందికి ఉపాధి కల్పిస్తూ 4289 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను నెలకొల్పినట్లు చెప్పారు. జిల్లాలో రూ. 6210 కోట్లతో 276 కి.మీ. మేర చేపట్టిన ఎనిమిది జాతీయరహదారుల నిర్మాణాలను త్వరిగతిన పూర్తి చేయడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.పంచాయతీరాజ్‌శాఖ ద్వారా రూ. 155 కోట్ల అంచనాతో చేపట్టిన 414 గ్రామ సచివాలయ భవనాలలో 257 పూర్తయ్యాయని, 221 ఆర్బీకేలు, 121 విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో పూర్తయ్యాయన్నారు.

ప్రగతిపథంలో రాయచోటి

రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కృషితో రాయచోటి పట్టణం అన్ని విధాలా అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. రాయచోటిలో ఖేలో ఇండియా పథకం కింద దాదాపు 25 ఎకరాలలో క్రీడా మౌలిక సదుపాయాల ఏర్పాటుకురూ. 50 కోట్ల అంచనా వ్యయంతో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థకు ప్రతిపాదనలు పంపామన్నారు. జగనన్నస్మార్ట్ టౌన్‌షిప్‌లో భాగంగా జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో మొత్తంగా 81 ఎకరాల్లో ఎంఐజీ లే అవుట్ల ప్రతిపాదనలను ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయాల వారీగా రూ. 20 లక్షల చొప్పున ఇప్పటివరకు 1645 పనులకుగాను 46 కోట్ల నిధులను మంజూరు చేశామన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేసిన అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నానని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు మేడా మల్లికార్జునరెడ్డి శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానమ్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డి వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి ఏపీఎండీసీ చైర్ పర్సన్ తమీం అస్లాం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఏపీఎండీసీ చైర్మన్ షమీమ్ అస్లం,రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



జాగిలం విన్యాసం



రాయచోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శకటం



రాయచోటి శ్రీసాయి పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

వేమన వెలుగుతోంది..!

వైవీయూ పరిధిలో అభివృద్ధి పనులకు వేర్వేరుగా రూ. 66 కోట్లు, రూ.6.87 కోట్లు మంజూరు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ఏర్పాటైన యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ, అంతర్జాతీయస్థాయిలో కీర్తిపతాకాలను రెపరెపలాడిస్తూ.. అభివృద్ధిలో దూసుకుపోతుంటే.. కళ్లుండి చూడలేని.. పచ్చపత్రికల అడ్డగోలు రాతలు విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులకు మనస్థాపాన్ని కలిగిస్తున్నాయి.. దీంతో విశ్వవిద్యాలయానికి సంబంధించిన ప్రగతి, ప్రభుత్వ సహకారం, నిధులకు సంబంధించిన అంశాలపై కథనం.



2010 నుంచి 2019 వరకు పరిపాలన భవనం పరిస్థితి



2020లో వైవీయూ పరిపాలన భవనం

- ప్రభుత్వ సహకారంతో అభివృద్ధిలో దూసుకుపోతున్న వైవీయూ
- ఇటీవలే న్యాక్ ఏ గ్రేడ్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాకింగ్ కైవసం

వైవీయూ : మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక చొరవతో 2006లో గ్రామీణ ప్రాంతమైన పెండ్లిమర్రి మండల పరిధిలో యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్ఆర్ హయాంలో దాదాపు రూ.100 కోట్లు నిధులు వెచ్చించి విశ్వవిద్యాలయంలోని సర్ సీవీ రామన్ సైన్స్‌బ్లాక్, చెయ్యేరు, పాపాఘ్ని, పెన్నా, చిత్రావతి హాస్టల్స్‌బ్లాక్‌లు నిర్మించారు. ప్రస్తుత పరిపాలన భవనంగా ఉన్న పరీక్షల విభాగం భవనాలను నిర్మించారు. దీంతో పాటు విశ్వవిద్యాలయ ప్రధాన పరిపాలన భవనంకు సంబంధించి రూ. 17 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించగా, రూ. 9.4కోట్లుతో దాదాపు 60 శాతం మేర పనులు పూర్తయ్యాయి. హ్యూమానిటీస్ భవన నిర్మాణాల కోసం రూ.4.30 కోట్లు, మేనేజ్‌మెంట్ భవన నిర్మాణం కోసం రూ. 2.60 కోట్లు వెచ్చించి ప్లింత్ లెవల్ పూర్తి చేశారు. దీంతో పాటు టీచింగ్ సిబ్బంది క్వార్టర్స్, నాన్‌టీచింగ్ క్వార్టర్స్, క్యాంపస్ స్కూల్, ఎస్సీ, ఎస్టీ హాస్టల్, మహిళా హాస్టల్, రోడ్లు తదితర అవసరాల నిమిత్తం విశ్వవిద్యాలయ అధికారులు రూ.48 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విశ్వవిద్యాలయ ప్రగతి శరవేగంగా సాగుతున్న సమయంలో వైఎస్ఆర్ మరణం విశ్వవిద్యాలయానికి తీరనిలోటుని మిగిల్చింది.

ఒక్క ఇటుక వేయని వైనం..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో ఏర్పాటైన భవనాలు మినహా ముఖ్యమంత్రులుగా పనిచేసిన కె. రోశయ్య, ఎన్. కిరణ్‌కుమార్‌రెడ్డి, నారా చంద్రబాబునాయుడు హయాంలో ఒక్క ఇటుక కూడా వేయలేదన్నది కఠోర సత్యం. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో యోగివేమన విశ్వవిద్యాలయానికి రెండుసార్లు వచ్చి విశ్వవిద్యాలయ ప్రగతికి చేయూతనిస్తామని ఊకదంపుడు ఉపన్యాసమిచ్చి.. ఉత్తుత్తి హామీలతో కాలం గడిపారు. విశ్వవిద్యాలయ అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలకు కేవలం కాగితాల్లోనే అంకెల గారడీ చేశారే తప్ప ఒక్క రూపాయి విశ్వవిద్యాలయ ఖాతాకు జమ కాకపోవడం గమనార్హం. ఆ సమయంలో అప్పటి వీసీ ఆచార్య అత్తిపల్లి రామచంద్రారెడ్డి విశ్వవిద్యాలయానికి యూజీసీ వారు అందించిన రూసా నిధులతో అప్పటికే దాదాపు 90 శాతం పూర్తయిన ఆర్ట్స్ అండ్ కామర్స్ భవనాన్ని పూర్తి చేసి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆర్ట్స్‌బ్లాక్‌గా నామకరణం చేశారు.

ఉన్నతవిద్యకు ఊతమిచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్..

ఉన్నతవిద్యలో పలు సంస్కరణలను తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వవిద్యాలయాల బలోపేతానికి సంపూర్ణస్వేచ్ఛను, సహకారాన్ని అందించారు. దీంతో యోగివేమన విశ్వవిద్యాలయం న్యాక్ ఏ గ్రేడ్ సాధించడంతో పాటు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో టాప్–200 విశ్వవిద్యాలయాల్లో చోటు దక్కించుకుంది. మరో వైపు విశ్వవిద్యాలయంలో ప్రధాన ముఖద్వారం, ప్రధాన పరిపాలన భవనం, రహదారులు అన్నింటి అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందించడంతో విశ్వవిద్యాలయం రూపురేఖలు మారిపోయాయి. ప్రధాన పరిపాలన భవనం సైతం పైలాన్ మినహా పూర్తిస్థాయిలో పూర్తవడంతో విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలు సైతం అక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తుండటం గమనార్హం.

యోగివేమన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ప్రొద్దుటూరులో ఉన్న వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ. 66 కోట్ల నిధులను మంజూరు చేస్తూ 2021లో ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి రూ. 5 కోట్లు నిధులు మంజూరు కాగా పనులు సైతం ప్రారంభించి ప్లింత్‌లెవల్ పనులు పూర్తికావచ్చాయి. దీంతో పాటు మరో రూ.20 కోట్ల మేర నిధులు సీఎంఎంఎస్ గ్రీన్ చానల్‌లో ఉండగా, మొత్తంగా రూ. 25.24 కోట్లు నిధులను మంజూరు చేసింది. పనులు పూర్తయ్యే కొద్దీ మిగతా మొత్తాన్ని ప్రభుత్వం జమచేస్తుంది.

వైవీయూకు అనుబంధంగా ఉన్న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, గ్రంథాలయం అభివృద్ధి, విస్తరణ పనులకు రూ.6,87,40,000/- కోట్లు నిధులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీఓనెం. 40 విడుదల చేసింది. స్థల సేకరణ, నూతన భవన నిర్మాణాలకు వినియోగించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంబంధిత రెవిన్యూ అధికారులు ప్రక్రియను వేగవంతం చేస్తే నిధులు ఖాతాల్లో పడతాయి.

హెల్త్‌సెంటర్ అభివృద్ధి కోసం..

విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సౌకర్యార్థం హెల్త్‌సెంటర్‌నుతాత్కాలికంగా వసతిభవనాల సమీపంలో ఏర్పాటు చేశారు. అనంతరం రూ.2 కోట్లతో హెల్త్‌సెంటర్ పనులను ప్రారంభించారు. ప్లింత్ లెవల్‌లో ఆగిపోయిన పనులకు రూ.90 లక్షల మేర నిధులను ప్రభుత్వం మంజూరు చేయడంతో హెల్త్‌సెంటర్ దాదాపు ఓ రూపుకు వచ్చింది. అయితే కాంట్రాక్టర్ల సమస్యతో కోర్టుకు వెళ్లడంతో పనులు నిలిచిపోయాయే తప్ప నిధుల కొరతతో కాదన్నది విశ్వవిద్యాలయ అధికారులు సమాధానం.

అభివృద్ధిలో అగ్రస్థానంలో వైవీయూ..

యోగివేమన విశ్వవిద్యాలయం వేగంగా అభివృద్ధి సాధిస్తోంది. న్యాక్ గ్రేడింగ్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో అనుమతులు ఇలా అన్నింటా వైవీయూ అగ్రస్థానంలో నిలుస్తోంది. ప్రభుత్వం సహకారం సంపూర్ణంగా లభించడంతో పాటు విశ్వవిద్యాలయ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, భవన నిర్మాణాలకు రూ. 70 కోట్లకు పైగా నిధులను మంజూరు చేసింది. ఉన్నతవిద్యలో సంస్కరణల్లోనూ వైవీ యూ ముందంజలో ఉంది.

– ఆచార్య చింతా సుధాకర్, వైస్ చాన్సలర్, వైవీయూ

నిధుల కొరత సమస్యే లేదు..

యోగివేమన విశ్వవిద్యాలయం అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తున్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు నిధులను వైవీయూకు మంజూరు చేశారు. విశ్వవిద్యాలయంలో అభివృద్ధి పనులకు నిధుల కొరత అన్న సమస్య లేదు. అభివృద్ధి అన్నది నిరంతర ప్రక్రియ.. ఇందుకోసం ఎప్పటికప్పుడు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తుంటాం.

– ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్, వైవీయూ

జగనన్న సుపరిపాలన దేశానికే ఆదర్శం

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శమని ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో జెడ్పీ చైర్మన్‌తో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం జవాబుదారితనంతో పనిచేస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నామన్నారు. సచివాలయ ఏర్పాటు వల్ల ప్రజల ముంగిటకే పరిపాలన వెళ్లిందన్నారు. జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష లాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించామన్నారు. ప్రజలకు దగ్గరయ్యేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రజా సేవలో ఉద్యోగులు పునరంకితం కావాలన్నారు. అవినీతి రహితంగాసేవలు అందించాలని కోరారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో రహదారులు, భవనాలు, తాగునీరు, ఎస్సీ ఎస్టీ మహిళా శిశు సంక్షేమం కింద మంజూరు చేసిన 110 అభివృద్ధి పనులకు 549 లక్షల రూపాయల జెడ్పీ సాధారణ నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘం గ్రాంటు కింద 24 సీపీడబ్ల్యుఎస్ స్కీములకు రూ. 25 కోట్లు మంజూరైందన్నారు. జెడ్పీ ఆదాయాన్ని పెంచేందుకు రూ. 2.40 కోట్ల అంచనాతో 30 షాపింగ్ రూములు జెడ్పీ ఆవరణలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత సంవత్సరం నుంచి 28 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చామని, 34 మందికి వివిధ కేడర్లలో పదోన్నతులు కల్పించామని వివరించారు. అనంతరం ఇన్‌ఛార్జి మంత్రి ఏడుగురికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తూ నియామక పత్రాలు అందజేశారు. అలాగే విశిష్ఠ సేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి, మాసీమబాబు, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు బాలయ్య, సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.



కడప : జిల్లా పరిషత్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ

ఉత్సాహంగా 'అట్‌హోమ్'

రాయచోటి : స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కలెక్టర్ గిరీషా పీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అట్‌హోమ్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. రాయచోటిలోని జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం అ ఏర్పాటు చేసిన ఈ తేనేటి విందులో శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఎస్పీ గంగాధర్ రావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, రామకృష్ణారెడ్డి, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అధికారులందరూ సమన్వయంతో విజయవంతం చేసినందుకు అభినందనలు తెలియజేశారు. ఇదేస్ఫూర్తితో అన్నిశాఖల జిల్లా అధికారులు సమన్వయంగా జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లాకు అభివృద్ధిలో ఓ ప్రత్యేక గుర్తింపును తీసుకురావాలని చెప్పారు.



కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన అట్‌హోమ్ కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీ

శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఆ సంక్షేమ ఫలాలు అందించేందుకు అధికారులు అందరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. జిల్లా ఎస్పీ గంగాధర్ రావు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖలు ఒక మంచి అవగాహనతో సమన్వయంగా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పేరెడ్ గ్రాండ్‌లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించిన అధికారులందరినీ ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. అట్‌హోమ్ ఒక మంచి కార్యక్రమం, జిల్లాస్థాయి అధికారులు అందరూ పాల్గొని ఉల్లాసంగా గడపడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు ప్రతి టేబుల్ వద్దకు వచ్చి అధికారులను ఆత్మీయంగా పలుకరిస్తూ ఉల్లాసంగా గడిపారు. ఈ అట్‌హోమ్ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీలు మద్దిలేటి, సత్యనారాయణ, సమాచారశాఖ డీఐపీఆర్ఓ భరత్ కుమార్ రెడ్డి, డిపిఆర్ఓ పురుషోత్తం, పిఆర్ఓ ధర్మనాయక్, పట్టుపరిశ్రమశాఖ జేడీ రాజశేఖర్ రెడ్డి, విద్యుత్ శాఖ డీఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్, వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐకి పతకం



కడప అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 77వ స్వాతంత్య్ర దినోత్సవల వేడుకల్లో భాగంగా విజయవాడలో కడప టూటౌన్ ఏఎస్ఐ పి. భాస్కర్ (ఏఎస్ఐ 246) ఇండియన్ పోలీస్ మెడల్‌ను అందుకున్నారు. పోలీసుశాఖలో దాదాపు 30 ఏళ్లపాటు ఏఎస్ఐ భాస్కర్ విశిష్ట సేవలను అందించారు. ఈ నేపథ్యంలో టూటౌన్ ఏఎస్ఐ భాస్కర్‌ను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

తొలి సినిమా హార్సిలీహిల్స్‌పైనే



హార్సిలీహిల్స్‌పై సందర్శకులతో రమాప్రభ

బి.కొత్తకోట : తాను నటించిన తొలి సినిమా కాళరాత్రి హార్సిలీహిల్స్‌పైనే చిత్రీకరణ జరిగిందని సీనియర్ నటి రమాప్రభ తెలిపారు. మంగళవారం బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ వచ్చిన ఆమె ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఈ సందర్భంగా టూరిజం ప్రాంగణంలో కూర్చుని సందర్శకులతో ముచ్చటించారు. తన సినీ ప్రస్థానం, నటించిన చిత్రాలు, నటనా అనుభవాల గురించి వారితో పంచుకున్నారు. రమాప్రభ ఏటా కొండపైకి వచ్చిన సేదతీరి వెళ్తుంటారు.

బైక్‌ను ఢీకొన్న కారు

బి.కొత్తకోట : కూలి పనులు చేసుకుని ఇంటికి వెళ్తుండగా కారు ఢీకొనడంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెకు చెందిన బాలాజీ (22), వెంకటేష్ (21)లు సోదరులు. బడికాయలపల్లె సమీపంలోని బడిగెద్దులవారి పల్లె చెందిన అంజి (30) భవన నిర్మాణ పనులకు బేల్దారులుగా పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. మండలంలోని గట్టులో పనికి వెళ్లిన వీరు బైక్‌పై ఇంటికి తిరుగుప్రయాణమయ్యారు. బడికాయలపల్లె రోడ్డులోని బిద్దిపల్లె వద్దకు రాగానే కర్ణాటకలోని కూరిగేపల్లె వైపు నుంచి బి.కొత్తకోట వైపుకు వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తర లించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం వెంకటేష్‌ను తిరుపతికి తరలించారు.

సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు మృతి

చక్రాయపేట : మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు, మండల మాజీ ఉపాధ్యక్షుడు చిలేకాంపల్లె బెల్లం కృష్ణారెడ్డి(87) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబీకులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు. ఈయన సతీమణి సరోజమ్మ చిలేకాంపల్లె ఎంపీటీసీ సభ్యురాలిగా పని చేశారు. ఈయన ఏపీ టూరిజం రాష్ట్ర డైరెక్టర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి పెద్ద నాన్న. ప్రస్తుత చిలేకాంపల్లె ఎంపీటీసీ సభ్యురాలు వర్ధన కూడా ఈయన కోడలే. ఈయన మరణించిన విషయం తెలియగానే లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, తొండూరు మండల ఇన్‌చార్జి మధు రెడ్డి, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డిలు ఆయన మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.

కనుల పండువగా స్వాతంత్ర్య వేడుకలు

అన్నమయ్య జిల్లా రాయచోటిలో రెండో ఏడాది రెపరెపలాడిన జాతీయ జెండా

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 77వ భారత స్వాతంత్ర్య దిన వేడుకలు కనులపండువగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లాలో అమలు చేస్తున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ప్రజలకు సందేశమిచ్చారు.

సీనియర్ సిటిజన్లకు సత్కారం : జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ గంగాధరరావులతో కలిసి సీనియర్ సిటిజన్లు.. రామాపురం మండలం పాత్తుకూరుపల్లి వీరబల్లి రామన్న(85) అదే మండలం సుద్దమళ్ల నాగమ్మ(85)లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు: రాయచోటి శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు దేశమంటే మతం కాదు, మట్టి కాదోయ్ అంటూ చేసిన నృత్యం, కార్గిల్ వార్‌ను స్ఫురించేలా వీరోచితంగా పోరాడిన దేశ సైనిక పాటవాన్ని ప్రదర్శిస్తూ కలికిరి సైనిక్ స్కూల్ విద్యార్థులు చేసిన నృత్యాలు దేశభక్తిని పెంపొందించాయి. మదనపల్లికి చెందిన పీపల్ ట్రీ స్కూల్ విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులు, మహాత్ములు, మహనీయుల వేషధారణలతో చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల ఉత్తమ ప్రదర్శనలో భాగంగా.. కలికిరి సైనిక్ పాఠశాలకు ప్రథమ బహుమతి, రాయచోటి శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూల్‌కు ద్వితీయ బహుమతి అందజేశారు. అలాగే ఉత్తమ శకటాల ప్రదర్శనలో భాగంగా.. జిల్లా నీటి యాజమాన్య సంస్థ డ్వామాకు ప్రథమ బహుమతి, దిశ వాహనానికి ద్వితీయ బహుమతి, రాయచోటి నగరపాలక సంస్థకు తృతీయ బహుమతి లభించింది. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, అవార్డులు, బహుమతులను ఇన్‌చార్జిమంత్రి బహూకరించారు. పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించినందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అవార్డులు అందుకున్న పోలీసు శాఖ అధికారులు, సిబ్బందిని అభినందించారు.

ఆస్తుల పంపిణీ : అనంతరం రూ.1.12 కోట్ల విలువైన ఆస్తులను మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఇందులో పరిశ్రమల శాఖ తరపున జగనన్న బడుగు వికాసం కింద రూ.47 లక్షలు సబ్సిడీ విలువతో తొమ్మిది కార్లను, అలాగే వ్యవసాయ శాఖ తరపున రూ.42 లక్షలతో 7 ట్రాక్టర్లను, మత్స్యశాఖ ద్వారా రూ.2.60 లక్షల సబ్సిడీతో ఒక ఆటో రూ.20 లక్షల రాయితీతో 25 మంది లబ్ధిదారులకు డ్రిప్ పరికరాలు పంపిణీ చేశారు.



రాయచోటి పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాణి గోవర్ధన్







సీనియర్ సిటిజన్లు నాగమ్మ, రామన్నలను సన్మానిస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్



మైన్ ప్రూఫ్ వాహనం



జిల్లా నీటి యాజమాన్యం శకటం



మున్సిపల్‌శాఖ శకటం



మదనపల్లె ప్రజావాణి స్కూలు చిన్నారుల నృత్య ప్రదర్శన



కలికిరి సైనిక్ స్కూలు విద్యార్థుల విన్యాసాలు



మదనపల్లె ప్రజావాణి స్కూలు చిన్నారుల నృత్య ప్రదర్శన



సైనిక్ స్కూలు విద్యార్థులకు మొదటి బహుమతి అందజేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి

• ఉత్తమ సేవలకు ప్రశంసలు



జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



సత్యనారాయణరావు, డీఆర్వో | రంగస్వామి, ఆర్డీఓ, రాయచోటి | జేవీ మురళి, ఆర్డీఓ, మదనపల్లె | రాజశేఖర్‌రెడ్డి, పట్టుపరిశ్రమ అధికారి | గుణశేఖర్‌పిళ్లై, పశుసంవర్ధకశాఖ అధికారి | రఘురాం, పౌరసరఫరాలశాఖ అధికారి | మద్దిలేటి, పీడీ, నీటి యాజమాన్య సంస్థ | సత్యనారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్



హరికృష్ణ, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ | కృష్ణ కిశోర్, ఏడీ, దివ్యాంగులశాఖ | సహదేవరెడ్డి, డిస్ట్రిక్ట్ ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ ఆఫీసర్ | ధనలక్ష్మి, డీపీఓ | పీవీ ప్రసన్నకుమార్, ఇంజనీరు, ఆర్‌డబ్ల్యుఎస్ | చంద్రశేఖర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, ఏపీఎస్‌పీడీసీఎల్ | కృష్ణమూర్తి, డిస్ట్రిక్ట్ వాటర్ రీసోర్స్ ఆఫీసర్ | మునిశేఖరయ్య, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్



కృష్ణానాయక్, సీపీఓ | పి.వెంకట్, ఏడీ సీపీఓ | వీఎస్‌కే చైతన్య, ఎస్‌డీపీఓ | బాలకృష్ణ, కలెక్టరేట్ ఏఓ | శ్రావణి, సూపరింటెండెంట్ | నిర్మలాదేవి, సూపరింటెండెంట్ | క్రాంతికుమార్, డిప్యూటీ తహసీల్దార్ | భరత్ కుమార్ రెడ్డి, జిల్లా సహకార శాఖ సంయుక్త శాఖ అధికారి | పురుషోత్తం, సమాచారశాఖ డీపీఆర్ఓ | బుక్కె ధర్మానాయక్, సమాచారశాఖ పీఆర్ఓ

గోవా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్


ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జమ్మల మడుగు రోడ్డులోని వెంకటేశ్వరకాలనీలో మద్యం విక్రయిస్తున్న వెంకటగోపాల్‌రెడ్డిని సెబ్ అధికారులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి పెద్ద ఎత్తున గోవా రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన మేరకు.. వెంకటగోపాల్ రెడ్డి, కుమారుడు వంశీకృష్ణారెడ్డి కొన్ని నెలలుగా గోవా రాష్ట్రం నుంచి మద్యం బాటిళ్లను తెప్పించి గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లోనే విక్రయించేవారు. తక్కువ ధరకు తెప్పించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో వారి ఇంట్లో పెద్ద ఎత్తున మద్యం సీసాలు ఉన్నాయని సమాచారం రావడంతో మంగళవారం సెబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో వెంకటగోపాల్‌రెడ్డిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి గోవా రాష్ట్రానికి చెందిన 128 మద్యం ఫుల్‌బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపించనున్నట్లు వివరించారు. వంశీకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసి అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దాడిలో ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.




స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో సెబ్ అధికారులు

కారు- ద్విచక్రవాహనం ఢీ

సిద్దవటం : మండలంలోని మిట్టపల్లె గ్రామ సమీపంలోని కడప-చెన్నై ప్రధాన రహదారిలో మంగళవారం సాయంత్రం కారు- ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒంటిమిట్ట మండలం చెంచుగారిపల్లె గ్రామానికి చెందిన అరవింద్, వై.శివశంకర్, లోకేశ్వర్లు ముగ్గురు స్వగ్రామం నుంచి కడపకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. తెలంగాణ రాష్ట్రం జడ్చర్లకు చెందిన కారు కడప వైపు నుంచి తిరుపతికి వెళుతోంది. ఈ సమయంలో మిట్టపల్లె గ్రామ సమీపంలోని డాబా వద్దకు రాగానే ద్విచక్రవాహనం వేగంగా వచ్చి కారును ఢీకొని కారు కిందకు దూరిపోయింది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న అరవింద్, వై.శివశంకర్, లోకేశ్వర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని ఒంటిమిట్ట, సిద్దవటంకు చెందిన 108 వాహన సిబ్బంది రిమ్స్‌కు తరలించారు. కారులో ఉన్న ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలు కావడంతో వారిని మాధవరం-1 లోని ఆర్ఎంపీ వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. సిద్దవటం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



కారు కిందకు దూసుకు పోయిన ద్విచక్రవాహనం





రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివశంకర్, లోకేశ్వర్, అరవింద్

సేవా పతకాలు


ఉత్తమ సేవాపతకం (2023) ఉగాది సందర్భంగా ప్రకటించినవి)

కడప అర్బన్ : జిల్లాలో పోలీస్‌శాఖలో విశిష్ట సేవలందించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సేవాపతకాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ అందజేశారు. జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు, జిల్లా ఎస్పీ అన్బురాజన్‌లు పతక గ్రహీతలను అభినందించారు.





ఉత్తమ సేవాపతకం మెడల్‌ను మంత్రి ఆదిమూలపు సురేష్ నుంచి అందుకుంటున్న కడప ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్



సేవాపతకం మెడల్‌ను అందుకుంటున్న ఏఆర్ ఎస్ఐ శేషాద్రి | శీలం మోహన్‌బాబు ఏఎస్ఐ



ఏఆర్ హెచ్‌సి ఆదిమూలం శ్రీనివాసులు | రిమ్స్ పీఎస్ ఏఎస్ఐ రాచరాయుడు | వల్లూరు ఏఎస్ఐ విజయలక్ష్మి | ఏఆర్ హెచ్‌సి రామసుబ్బయ్య

ఆటోను ఢీకొన్న లారీ

- సెప్టిక్‌ట్యాంక్ కార్మికుడి మృతి
- మరొకరి పరిస్థితి విషమం

మదనపల్లె : ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో సెప్టిక్‌ట్యాంక్ కార్మికుడు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా మారిన ఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. తమిళనాడుకు చెందిన చిన్న(42), తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన ముత్యాలప్ప(35), మదనపల్లె పట్టణానికి చెందిన గోపి సెప్టిక్‌ట్యాంక్ క్లీనింగ్ వాహనంలో ట్యాంక్ క్లీనర్లుగా పనిచేస్తున్నారు. మంగళవారం పుంగనూరు మండలం ఈడిగపల్లెలో సెప్టిక్‌ట్యాంక్ క్లీనింగ్ పనులు చేసేందుకు యజమానికి చెందిన ఆటోలో వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి మదనపల్లెకు వస్తుండగా, మార్గమధ్యంలో నవోదయ స్కూల్ మలుపు వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన లారీ ఆటోను ఢీకొంది. ప్రమాదంలో చిన్న ముత్యాలప్ప, ఇద్దరు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు వెంటనే బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తమిళనాడుకు చెందిన చిన్న మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముత్యాలప్ప పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.



మృతిచెందిన చిన్న



గాయపడిన ముత్యాలప్ప